# పింఛన్ల పండగ ఆనందం మెండుగ

వైఎస్సార్ పింఛన్ కానుక.. చాలా మంది వృద్ధులకు, ఒంటరి మహిళలకు అదే జీవనాధారం. పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని మలి వయసు వ్యక్తులకు అంతో ఇంతో ఆదరణ దక్కుతుందంటే పింఛన్ వల్లేనంటే అతిశయోక్తి కాదు. అందుకే అవ్వాతాతలు, ఒంటరి మహిళల పాలిట సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఆపద్బాంధవుడయ్యాడు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రూ.3 వేల పింఛన్ ఈ నెల నుంచి అమలుకానుండటంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లువెత్తుతోంది.




- ఈ నెల నుంచే పెంచిన రూ.3 వేల పింఛన్ పంపిణీ
- చెప్పాడంటే.. చేస్తాడంతే.. అంటూ ఆనందంలో లబ్ధిదారులు


ప్రసాద్‌గార్డెన్స్‌లో ఇంటికి వెళ్లి పింఛన్ అందిస్తున్న వలంటీర్


ఆస్పత్రిలో ఉన్న లబ్ధిదారుడికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

జగదాంబ: గత ప్రభుత్వాల పాలనలో పింఛన్ల పంపిణీ ఓ ప్రహసనం. ఏ రోజిస్తారో.. ఎంత మందికి స్తారో తెలియదు. ఉదయం నుంచి పడిగాపులు. బ్యాంకుల్లో వేస్తే దాన్ని తీసుకోవడానికి నానా అగచాట్లు పడే నిరక్షరాస్యులు. కొత్త పింఛన్ల నమోదు కోసం ఏళ్ల తరబడి నిరీక్షణ. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పింఛన్ లబ్ధిదారుల వెతలు తీరాయి. సచివాలయ వ్యవస్థలో వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటికొచ్చి మరీ పింఛన్ అందించడంతో తమను కన్నబిడ్డలా చూసుకునే ప్రభుత్వం వచ్చిందన్న ఆనందం లబ్ధిదారుల్లో కలిగింది.

**చెప్పాడంటే.. చేస్తాడంతే..**

సీఎం జగన్ మాటిస్తే జరిగి తీరుతుందన్న నమ్మకం ప్రజలందరిలో ఉంది. అందుకు ఎన్నికల సమయంలో ఏకంగా రూ.2 వేల పింఛన్ అమలు చేస్తానని, దాన్ని రూ.3 వేలకు పెంచుకుంటూ వెళ్తానని మాటిచ్చారు. ఆ మాట మేరకు వరుసగా మూడేళ్లలో రూ.2,250, రూ.2,500, రూ.2,750 చొప్పున పెంచుకుంటూ వచ్చారు. జనవరి నుంచి దాన్ని రూ.3 వేలకు పెంచి, ఆ మేరకు పింఛన్ అందించేందుకు సమయాత్తమయ్యారు. పెంచిన పింఛన్ మొత్తం ప్రజలందరికీ తెలిసేలా, వారికి అవగాహన కల్పిస్తూ విడతల వారీగా పింఛన్ల పంపిణీ కార్యక్రమాలు చేపట్టేందుకు స్థానిక యంత్రాంగం సన్నాహాలు పూర్తి చేసింది. వలంటీర్ పరిధిలో అందుబాటులోలేని లబ్ధిదారులకు, వారెక్కడుంటే అక్కడికి వెళ్లి మరీ అందించేలా ఏర్పాట్లు చేశారు.

**జీవీఎంసీ 35వ వార్డు వివరాలు**

| | |
|---|---|
| మొత్తం ఫించన్లు 1756 | వికలాంగులు 161 |
| వృద్ధులు 802 | ఒంటరి మహిళ 62 |
| వితంతువులు 701 | డీఎంహెచ్‌వో 18 |
| అభయహస్తం 01 | మత్స్యకార పింఛన్లు 05 |
| ట్రాన్స్‌జెండర్స్ 01 | |


పండావీధిలో నడవలేని స్థితిలో ఉన్న వృద్ధుడికి ఫించన్ ఇస్తున్న సెక్రటరీ

### ఈ ఆనందం జగన్‌బాబు చలవే



ఈ వయసులో కూడా ఇంత ధీమా, ఆనందం ఉందంటే అదంతా జగన్ బాబు చలవే. గతంలో అధికారుల కార్యాలయలకు పదే పదే వెళ్లి, వేడుకున్నా ఇవ్వని పింఛన్లు, ఇంటి వద్దకే వచ్చి నమోదు చేసుకుంటున్నారు. అంతే వేగంగా లబ్ధిదారుల జాబితాలో చేర్చుతున్నారు. ఒకటో తేదీ వేకువజామునే ఇంటి ముంగిటకు వచ్చి పింఛన్ నగదు చేతికిస్తున్నారు. ఇంతకంటే ప్రభుత్వం ఏం చేయాలి.

– నర్సయ్య, ప్రసాద్‌గార్డెన్స్

### పెద్దకొడుకులా ఆదరిస్తున్నాడు



మాలాంటి ముసలివాళ్లకు జగన్‌బాబు పెద్దకొడుకులా అండగా నిలిచారు. ఇంట్లో వారే చీదరించుకునే బతుకులకు అంతులేని భరోసా ఇచ్చారు. ఒక్కసారిగా రూ.2 వేలుకు పెంచడమే గొప్పనుకుంటే దాన్ని రూ.3 వేలు వరకు తీసుకెళ్లడం చాలా ఆనందంగా ఉంది. గతంలో పింఛన్లు అందుకోవడానికి పడ్డ కష్టాలు ఇంకా గుర్తున్నాయి. జగన్ పాలనలో ఇంటికే వచ్చి ఇవ్వడం మర్చిపోలేని మేలు.

– దళాయి ఈశ్వరమ్మ, దుర్గామాంబ సమాజం

### వెంటనే పింఛన్ నమోదు



నాకు ఆరోగ్యం క్షీణించడంతో పూర్తిగా నడవలేని స్థితికి చేరుకున్నాను. మా వలంటీర్ వికలాంగ పింఛన్ కోసం మా ఇంటికే వచ్చి వివరాలు తీసుకున్నారు. అవసరమైన పత్రాలకు సచివాలయంలో దరఖాస్తు పెట్టారు. అవి వచ్చాక, వాటి సాయంతో నా సమక్షంలోనే ఆన్‌లైన్లో నమోదు చేశారు. పింఛన్ వస్తుందో.. రాదో అనుకున్నా. పింఛన్ లబ్ధిదారుల జాబితాలో నా పేరుంది. జగనన్న ప్రభుత్వం మేలు మర్చిపోలేను.

– రాము, లక్ష్మీనగర్

### ఉదయాన్నే వెళ్లి కూర్చునేవాళ్లం



గతంలో మాకు రావాల్సిన పింఛన్ డబ్బుల కోసం ఉదయాన్నే వెళ్లి ఆరు బయట ఎండలో కూర్చునేవాళ్లం. పింఛన్లు ఇచ్చే ఆఫీసరు వచ్చేవాడు కాదు. రెండు మూడు రోజులు ఇదే తంతు. అప్పటికీ ఇవ్వకపోతే ఆ నెల పింఛన్ రానట్లే. తర్వాతి నెల కోసం ఆశగా ఎదురు చూసేవాళ్లం. ఈ ప్రభుత్వంలో ఆ కష్టాల్లేవు. వలంటీర్ ఒకటో తేదీన ఇంటికే వచ్చి పింఛన్ డబ్బులు మా చేతికిస్తున్నారు.

– నీలమ్మ, పండావీధి

## క్లుప్తంగా

### వాసుపల్లికి ఘన స్వాగతం


ఎమ్మెల్యే వాసుపల్లికి విమానాశ్రయం వద్ద స్వాగతం పలుకుతున్న పార్టీ నాయకులు

సీతమ్మధార: దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యుడు వాసుపల్లి గణేష్‌కుమార్‌కు విశాఖ విమానాశ్రయంలో ఘనంగా స్వాగతం పలికారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుని తిరిగి విశాఖ చేరుకున్న సందర్భంగా సోమవారం రాత్రి 27వ వార్డుకు చెందిన వార్డు అధ్యక్షుడు, ఎరుకుమాంబ దేవస్థానం చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు. కార్యక్రమంలో మధురెడ్డి, గురుమూర్తి, భాస్కర్, ఆంగటి కుమారి, మల్లేశ్వరి, దళాయి అన్నపూర్ణ, శ్రావణి, పవన్, గుడ్ల బాబ్జి, బాబు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

### హెల్త్ ఉద్యోగుల క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ


వైద్య ఉద్యోగుల డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: ఏపీ నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) జేఏసీ ఆధ్వర్యంలో క్యాలెండర్లు, డైరీ సోమవారం ఆవిష్కరించారు. రేసవానిపాలెం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షులు శోభాభూషణరావు, ప్రధాన కార్యదర్శి వీరబ్రహ్మం, వర్కింగ్ ప్రెసిడెంట్ కేసీహెచ్ నాగరాజు, ఇతర నాయకులు కిషోర్, రమణ, గోపీనాథ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**క్యాలెండర్ ఆవిష్కరణ**


ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్అండ్‌బీ ఎస్ఈ కాంతిమతి

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ విశాఖ జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను రహదారులు, భవనాల శాఖ ఎస్ఈ కె.కాంతిమతి తన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎంఏ ఖాదర్, సెక్రటరీ సత్యనారాయణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

### అలరించిన శుభారంభ సంకీర్తనలు


సంకీర్తనలు ఆలపిస్తున్న సభ్యులు

బీచ్‌రోడ్డు: హరే కృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో విశ్వశాంతి కోసం బీచ్‌రోడ్డులోని శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల విగ్రహం వద్ద శుభారంభ సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో భాగంగా చైతన్య మహా ప్రభు, నిత్యానంద మహా ప్రభులకు హారతి ఇచ్చారు. విద్యార్థుల నాటక ప్రదర్శన అలరించింది. అనంతరం హరే కృష్ణ మూమెంట్ అధ్యక్షుడు నిష్కించిన భక్తదాస ప్రవచనాలు సాగాయి.

### మర్యాదపూర్వక కలయిక

కంచరపాలెం: పోర్ట్ చైర్మన్ అంగముత్తును నేషనల్ పోర్ట్ ట్రస్ట్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు గొర్లె చందు, యూనియన్ సభ్యులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్రావ్, వైస్ ప్రెసిడెంట్ పీవీ రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ అప్పలనాయుడు, సెక్రటరీ శశి, సభ్యులు ఎస్‌కే రాజా, రవి, శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



# కనకమహాలక్ష్మికి విశేష పూజలు


విశేష పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా 19వ రోజు సోమవారం అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, అమ్మవారికి సహస్ర నామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన జరిపారు. అమ్మవారికి క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

**త్రికాల పంచామృతాభిషేక సేవలో..**

అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో 62 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. మార్గశిర గురువారాల్లో త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొన దలచే భక్తులు రూ.7,500, గురువారం మినహా మిగతా రోజుల్లో రూ.2,500 పూజా రుసుం చెల్లించాలి. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్ 0806081 పేరిట పూజా రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ట్రాన్సాక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, వాట్సప్ నంబర్‌ను 8985515989 నంబర్‌కు లేదా మెయిల్ ఐడీ dceoskmlad@gmail.com ద్వారా పంపవచ్చు.

**జగన్నాథస్వామి ఆలయంలో అన్నదానం**

మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 3 వేల మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం**

సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. విజయనగరానికి చెందిన శ్రీధర్ రాజేశ్వరిచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన, విశాఖకు చెందిన కె.గాయత్రిచే నిర్వహించిన భక్తి సంగీత కార్యక్రమాలు అలరించాయి. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం కళారాధన మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీచే కూచిపూడి నృత్యం ఏర్పాటు చేసినట్లు ఈవో శిరీష తెలిపారు.

**ధర్మప్రచార కార్యక్రమం**

ధర్మప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం అమ్మవారి ప్రచార రథం పద్మనాభ మండలం రెడ్డిపల్లి ఏరియా శేరిఖండం, పొట్నూర్ గ్రామంలో నిర్వహించారు. గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నాదస్వర మంగళ వాయిద్యాలు, ప్రచార రథంలో వేంజేసిన కనకమహాలక్ష్మికి 197 మందిచే సామూహిక కుంకుమ పూజలు జరిపారు.

# షూటింగ్ చివరి దశకు 'కంచర్ల'

- న్యూ ఇయర్ వేడుకల్లో చిత్ర నిర్మాత కంచర్ల అచ్యుతరావు


చిత్ర యూనిట్ మధ్య కేక్ కట్ చేస్తున్న హీరో ఉపేంద్ర, నిర్మాత కంచర్ల అచ్యుతరావు తదితరులు

అల్లిపురం: ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ బ్యానర్లో యాద్‌కుమార్ దర్శకత్వంలో ఉపేంద్ర కథానాయకుడుగా కంచర్ల సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుందని చిత్ర నిర్మాత కంచర్ల అచ్యుతరావు తెలిపారు. చిత్ర యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం డాబాగార్డెన్స్‌లో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో చిత్ర హీరో ఉపేంద్ర పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత అచ్యుతరావు మాట్లాడుతూ ఇప్పటికే విడుదల అయిన ఉపేంద్ర గాడి అడ్డా విజయవంతం అయిందన్నారు. కంచర్ల సినిమా పోరాట సన్నివేశాలు ఆరిలోవ, సింహాచలం, సబ్బవరం, అనకపల్లి, జగదాంబ సెంటర్, డాబాగార్డెన్స్ తదితర ప్రాంతాల్లో చిత్రీకరించినట్లు పేర్కొన్నారు. ఐదు చిత్రాలు సెట్స్‌పై ఉన్నాయన్నారు. ఇళయరాజా సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో బ్రహ్మానందం కీలక పాత్రలో నటిస్తున్నట్లు వెల్లడించారు. హీరో ఉపేంద్ర మాట్లాడుతూ ఉపేంద్ర గాడి అడ్డా విజయం ఆనందాన్నిచ్చిందని, రెండో చిత్రం కంచర్ల ఫిబ్రవరి రెండో వారంలో విడుదలకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే టాకీ పార్టు పూర్తయిందన్నారు. చిత్ర దర్శకుడు యాద్‌కుమార్ మాట్లాడుతూ ఇంటర్వెల్ బ్యాక్ డ్రాప్‌లో వచ్చే యాక్షన్ సన్నివేశాలను నగరంలోని పలు ప్రాంతాల్లో చిత్రీకరించామన్నారు.

### విద్యా సంస్థలకు ఔషధ మొక్కల అందజేత

ఎంవీపీ కాలనీ: గ్రీన్ క్లైమేట్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో సోమవారం పండ్లు, ఔషధ మొక్కలు, పక్షులు గూళ్లు పెట్టుకునే మొక్కలను పంపిణీ చేశారు. ఆంగ్ల నూతన సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకొని సంస్థ ఎకో వైజాగ్‌ను జయప్రదం చేద్దాం .. మన పర్యావరణాన్ని మనమే కాపాడుకుందాం నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో భాగంగా ఎంవీపీ కాలనీలోని పలు విద్యాసంస్థల అధ్యాపకులు, విద్యార్థులకు మొక్కలు అందజేశారు. ఏఎస్ రాజా జూనియర్ కళాశాల, వీఎంసీ డిగ్రీ కళాశాల, సమత డిగ్రీ, పీజీ కళాశాల ఉద్యోగులు, విద్యార్థులు, గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

# కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ...


కలెక్టర్ మల్లికార్జునకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గణేష్‌కుమార్


జేసీ విశ్వనాథన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జిల్లా నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు

మహారాణిపేట: నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఉద్యోగులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.వి.కిరణ్‌కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వి.అశోక్‌కుమార్, నాయకులు బంగార్రాజు, కర్రి రాజేష్, నాగేశ్వరరావు, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

**దేవాలయాలు కిటకిట**

అల్లిపురం: నూతన సంవత్సరం సందర్భంగా నియోజకవర్గంలో దేవాలయాలు కిటకిటలాడాయి. అర్ధరాత్రి నుంచే భక్తులు దేవాలయాలకు క్యూ కట్టారు. నియోజకవర్గంలో ప్రధాన ఆలయాలు బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం, అస్సాం గార్డెన్స్‌లోని నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం, శ్రీ శివరామకృష్ణ దేవస్థానంతో పాటు అచ్చియ్యమ్మపేట శ్రీ షిరిడి సాయిబాబా ధ్యానమందిరం, అభయహస్తాంజనేయ దేవాలయాల్లో భగవంతుని దర్శనానికి భక్తులు బారులు తీరారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొబ్బరితోటలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానికులు కేక్ కట్ చేసి రంగులు జల్లుకుంటూ ఆనందోత్సాహాల మధ్య గడిపారు.

**కలెక్టర్, జేసీకి ఉద్యోగుల శుభాకాంక్షలు**

జిల్లా ప్రభుత్వ నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉద్యోగులు సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ తదితరులను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఒమ్మి పెద్దారావు, హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, డైరెక్టర్లు జోగి నాయుడు, కిలాని అప్పారావు, జిల్లా సహాధ్యక్షుడు ఎల్.లోకేష్‌రావు, సంఘం కోశాధికారి ఉప్పిలి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టర్‌కు గంట్ల శుభాకాంక్షలు**

జిల్లా కలెక్టర్ మల్లికార్జునకు సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు సింహాద్రి అప్పన్న ఫొటోను అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

**30వ వార్డులో కేక్ కటింగ్**

నూతన సంవత్సరం సందర్భంగా 30వ వార్డు సాలిపేటలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, కార్పొరేటర్ కొడూరు అప్పలరత్నం కేక్ కట్ చేసి, పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డి.చిన్ని, డి.బాల, దశమంతుల మాణిక్యాలరావు, పి.సత్యనారాయణ, కె.ఆనంద్ పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కార్పొరేటర్ అప్పలరత్నం


బల్లిగిరి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


నీలమ్మవేపచెట్టు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

### వైభవంగా గోదా రంగనాథుల తిరువీధి


గోవింద భజనలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: ధనుర్మాస మహోత్సవాలలో భాగంగా భానోజీనగర్, శ్రీ రామసాయి ఆలయం ఆధ్వర్యంలో సోమవారం గోదా రంగనాథుల తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. గోవింద నామస్మరణతో, భజనలతో భక్తులు తిరువీధిగా అల్లిపురం, మెయిన్‌రోడ్డులోని శ్రీరామాలయంలో గోదా రంగనాథుల విగ్రహాలను తోడ్కొని వచ్చి నిలిపారు. గోవింద భజనలతో ప్రాంతం మార్మోగింది. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీహరి భక్త బృందం ప్రతినిధులు మాట్లాడుతూ డిసెంబర్ 16 నుంచి జనవరి 14 వరకు రోజుకో దేవాలయం చొప్పున 31 దేవాలయాల్లో పూజలు నిర్వహించి, అన్నసమారాధన చేయనున్నట్లు పేర్కొన్నారు.

### 4న మహా కాలభైరవ రుద్ర హోమం

దాబాగార్డెన్స్: కాలభైరవ జయంతి సందర్భంగా పెందుర్తి మండలం పెదగాడి గోశాల వద్ద ఈ నెల 4న అష్ట భైరవ సహిత మహా కాలభైరవ రుద్రహోమం నిర్వహించనున్నట్లు భైరవ శక్తి ఫౌండేషన్ ముఖ్య కార్యదర్శి వివేకానంద సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ప్రముఖ కాలభైరవ ఉపాసకుడు విశ్వసాయి గురూజీ సంకల్పంతో లోక కల్యాణం కోసం చేపడుతున్నట్లు తెలిపారు. శృంగేరి పాలక్కడ్ శాఖ వేద పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ బోల్లప్రగడ దరహాస్ శర్మ వేద పండిత బృందం ఈ హోమం చేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల భక్తులు 9110544496 నంబర్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు.

### అయోధ్య అక్షింతల పంపిణీ


శ్రీ షిరిడి సాయి ధ్యానమందిరంలో అక్షింతలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

అల్లిపురం: అయోధ్య దేవాలయం ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా అయోధ్యలో జరిగిన పూజా కార్యక్రమాల అక్షింతలను సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా భక్తులకు పంపిణీ చేశారు. అల్లిపురంలోని పలు దేవాలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో అక్షింతల పంపిణీ చేపట్టారు. భక్తులు వాటిని తీసుకునేందుకు ఉత్సాహం చూపారు. అల్లిపురంలోని శ్రీ కోదండ రామాలయం, అచ్చియ్యమ్మపేట శ్రీ షిరిడి సాయి ధ్యానమందిరం, అభయాంజనేయస్వామి దేవాలయాల్లో భక్తులకు అక్షింతలు పంపిణి చేపట్టారు.

**దొండపర్తిలో..**


దొండపర్తిలో అక్షింతలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్

సీతమ్మధార : బాల రాముని పూజలో వినియోగించిన పవిత్ర అక్షింతల్ని అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సోమవారం దొండపర్తిలో పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు పాల్గొని, ఇంటింటికీ వెళ్లి అక్షింతల్ని అందించారు. వీటి ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ ప్రకాష్‌రెడ్డి, పార్టీ దక్షిణ నియోజకవర్గం కో కన్వీనర్ కారాల మహేష్, వార్డు అధ్యక్షులు ఎ.కుమార్ రాజు, వార్డు ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, శ్రీదేవి, జి.వరలక్ష్మి, ఎం.రాజేశ్వరి పాల్గొన్నారు.